www.prajasakti.com

ప్రజాశక్తి

మంగళవారం 19 నవంబర్ 2024 | 5 | ఏలూరు

జిల్లా కారాగారం సందర్శన

ప్రజాశక్తి - ఏలూరు అర్బన్

ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లా న్యాయ సేవాధికార సంస్థ చైర్మన్, జిల్లా ప్రధాన న్యాయమూర్తి సి.పురుషోత్తం కుమార్ ఆదేశాలతో ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి కె.రత్న ప్రసాద్ సోమవారం ఏలూరులోని జిల్లా కారాగారాన్ని సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కారాగారంలోని ఖైదీలకు అందిస్తున్న వసతులపైన, అలాగే వారికి అందుబాటులో ఉన్న న్యాయవాదులు, కేసుల వివరాలపైన ఎప్పటికప్పుడు తెలుసుకొని వారికి జిల్లా న్యాయ సేవాధికార సంస్థ సహాయం చేస్తుందని తెలియజేశారు. ఖైదీలతో మాట్లాడుతూ డిసెంబర్ 14వ తేదీన రాష్ట్ర వ్యాప్తంగా జాతీయ లోక్‌అదాలత్ నిర్వహిస్తున్నారని, రాజీయోగ్యమైన కేసులలోని ముద్దాయిలు సమస్యను పరిష్కరించుకొని కేసు నుండి విముక్తి పొందాలని సూచించారు. ఈ కార్యక్రమంలో కారాగారం సూపరింటెండెంట్ సిహెచ్.ఆర్‌వి.స్వామి, జైలర్ కె.శ్రీనివాసరావు పాల్గొన్నారు.

108 సమ్మె సైరన్..!

సమస్యల పరిష్కారం కోసం ఉద్యోగుల పోరుబాట

25 నుంచి సమ్మెకు సన్నద్ధం

కలెక్టర్, అధికారులందరికీ సమ్మె నోటీసులు అందజేత

రెండు జిల్లాల్లో సేవలందిస్తున్న 50 అంబులెన్స్‌లు

నెలకు దాదాపు 2,400 మంది రోగులకు సేవలు

ప్రజాశక్తి - ఏలూరు ప్రతినిధి

తమ సమస్యలను పరిష్కరించాలని 108 ఉద్యోగులు రోడ్డెక్కారు. ఇప్పటికే ప్రభుత్వం స్పందించకపోతే ఈ నెల 25 నుంచి సమ్మెలోకి వెళ్లేందుకు ఉద్యోగులంతా సిద్ధమయ్యారు. ఇప్పటికే కలెక్టర్ నుంచి సంబంధిత అధికారులందరికీ సమ్మె నోటీసులు అందించారు. 108 ఉద్యోగుల సేవల గురించి ఎంత చెప్పినా తక్కువే. పగలూ రాత్రీ అనే తేడా లేకుండా ఆపదలో ఉన్న వారిని కాపాడేందుకు ముందుండేది 108 ఉద్యోగులే. రోడ్డు ప్రమాదాలు జరిగినా, అర్ధరాత్రి గర్భిణులకు పురిటి నొప్పులు వచ్చినా ఆపద్బాంధవునిలా 108 వాహనం వచ్చి వాలిపోతుంది. రోగులను కాపాడేందుకు అందులో పని చేసే ఉద్యోగులు ఎంతగానో శ్రమిస్తారు. అత్యవసర పరిస్థితుల్లో గర్భిణులకు వాహనంలోనే ప్రసవం చేసిన ఘటనలు సైతం అనేకం ఉన్నాయి. ఆపద వస్తే ప్రతి ఒక్కరికీ గుర్తొచ్చేది 108 వాహనమే. ప్రజలకు ఇంత దగ్గరగా సేవలందిస్తున్న ఉద్యోగుల జీవన పరిస్థితి మాత్రం ఎక్కడ వేసిన గొంగళి అక్కడే అన్నట్లు తయారైంది. ఏళ్లు గడుస్తున్నా 108 ఉద్యోగుల సమస్యలను మాత్రం ప్రభుత్వం పరిష్కరించకుండా కాలయాపన చేస్తూనే ఉంది. ప్రయివేటు సంస్థలకు 108 అంబులెన్స్‌ల నిర్వహణా బాధ్యతను అప్పగించడంతో ఉద్యోగులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి రావడంతో తమ సమస్యలు పరిష్కారమవుతాయని ఉద్యోగులంతా భావించారు. ప్రభుత్వం నుంచి సరైన స్పందన లేకపోవడంతో సమ్మెబాట పట్టేందుకు సిద్ధమయ్యారు. 108 ఉద్యోగులు సమ్మెలోకి వెళ్తే ప్రజలకు తీవ్ర ఇబ్బందులు ఎదురయ్యే పరిస్థితి ఉంది. ఉద్యోగుల సమస్యలను వెంటనే పరిష్కరించి సమ్మెను విరమింపజేయాలనే అభిప్రాయం సర్వత్రా వ్యక్తమవుతోంది. ఏలూరు జిల్లాలో 28, పశ్చిమగోదావరి జిల్లాలో 23 మొత్తం 51 వాహనాలు ప్రజలకు సేవలందిస్తున్నాయి. గడిచిన ఏప్రిల్ నుంచి అక్టోబర్ వరకూ ఏలూరు జిల్లాలో 16,568 మంది రోగులను 108 అంబులెన్స్‌ల్లో తరలించారు. ప్రతినెలా సరాసరిన 2,360 మందిని 108 వాహనాల్లో తరలించి వైద్య సేవలు అందిస్తున్న పరిస్థితి. ప్రభుత్వం 108 ఉద్యోగుల సమస్యలను పరిష్కరించకపోతే సమ్మె కారణంగా జనం తీవ్ర ఇబ్బందులు పడే పరిస్థితి ఉంది.

108 ఉద్యోగుల డిమాండ్లు ఇవే

ఉద్యోగులు పలు సమస్యలకు సంబంధించిన డిమాండ్లను ఇప్పటికే ప్రభుత్వం ముందుంచారు. అవన్నీ న్యాయమైన డిమాండ్లే. ఉద్యోగులు పేర్కొన్న డిమాండ్లు ఇవే. 108 అంబులెన్స్ వ్యవస్థను నేరుగా ప్రభుత్వమే నిర్వహించాలి. ప్రస్తుతం ఉన్న రెండు షిఫ్టుల విధానాన్ని మూడు షిఫ్టుల విధానంలోకి మార్చి ఎనిమిది గంటల పని విధానం అమలు చేయాలి. 108 సర్వీసుల్లో పని చేస్తున్న ఉద్యోగులకు ప్రభుత్వ నియామకాల్లో వెయిటేజీ మార్కులు ఇవ్వాలి. వైద్యఆరోగ్యశాఖలోని ఇఎంటి పోస్టుల నియామకాల్లో 108లో పని చేస్తున్న ఇఎంటిలను నియమించాలి. గతంలో టిడిపి ప్రభుత్వంలో అమలు చేసిన జిఒ.49 ప్రకారం ఉద్యోగులకు నెలకు రూ.నాలుగు వేలు చెల్లించేవారు. వైసిపి ప్రభుత్వం దాన్ని నిలుపుదల చేసింది. జిఒ 49ను పునరుద్ధరించాలి. సహజ, ప్రమాద మరణం పొందిన ఉద్యోగి కుటుంబానికి రూ.25 లక్షలు ఎక్స్‌గ్రేషియా అందించాలి. ప్రతి మండల కేంద్రంలోనూ 108 వాహనాలకు, అందులో పని చేస్తున్న ఉద్యోగులకు శాశ్వత భవనాలు ఏర్పాటు చేయాలి. ప్రస్తుత నిర్వహణా సంస్థ నుంచి ఉద్యోగులకు రావాల్సిన బకాయిలను పూర్తిగా చెల్లించే బాధ్యతను ప్రభుత్వమే చేపట్టాలి. ఎఎంఎస్ సంస్థ ఇచ్చిన హామీ మేరకు వేతన శ్లాబులు అప్‌డేట్ చేయాలి. మరమ్మతులకు గురైన వాహనాలను వెంటనే బాగుచేయించాలి. ప్రతి ఉద్యోగికీ 40 శాతం ఇంక్రిమెంటును జులై నుంచి లెక్కగట్టి వచ్చే నెల వేతనంలో జమ చేయాలి. వేతనాలు ప్రతినెలా ఐదో తేదీలోపు చెల్లించేలా చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

ఒప్పందాలపై జిఒలు ఇవ్వండి

కలెక్టరేట్ వద్ద ఆశాల ధర్నా

నినదిస్తున్న ఆశాలు

ప్రజాశక్తి - ఏలూరు అర్బన్

ఆశా వర్కర్లతో గత ఫిబ్రవరిలో జరిగిన చర్చల్లో యూనియన్‌తో చేసుకున్న ఒప్పందాలను జిఒలుగా విడుదల చేయాలని కోరుతూ ఎపి ఆశా వర్కర్స్ యూనియన్ (సిఐటియు) రాష్ట్ర కమిటీ పిలుపులో భాగంగా సోమవారం స్థానిక కలెక్టరేట్ వద్ద ధర్నా నిర్వహించారు. ధర్నాకు జిల్లా నలుమూలల నుండి వందలాది మంది ఆశాలు తరలొచ్చారు. కార్యక్రమానికి యూనియన్ జిల్లా అధ్యక్షులు కమల అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా యూనియన్ రాష్ట్ర అధ్యక్షురాలు కె.పోశమ్మ, సిఐటియు జిల్లా అధ్యక్షులు ఆర్.లింగరాజు మాట్లాడుతూ గత ప్రభుత్వంతో చేసుకున్న ఒప్పందాల జిఒలు ఇవ్వకుండా తమకు సంబంధం లేదన్నట్లుగా వ్యవహరించడం సరైంది కాదన్నారు. వైద్య ఆరోగ్యశాఖ అధికారులు యూనియన్‌తో చర్చలు జరిపి మినిట్స్ కాపీ ఇచ్చారని గుర్తు చేశారు. ఆశా వర్కర్ల వయోపరిమితి 62 ఏళ్లకు పెంపు, గ్రూప్ ఇన్సూరెన్స్ రూ.10 లక్షలు, రిటైర్‌మెంట్ బెనిఫిట్ రూ.60 వేలు ఇస్తామని వాగ్దానం చేసి గత ప్రభుత్వం వాటికి జిఒలు ఇవ్వకుండా మోసగించిందన్నారు. గత ఐదు నెలల్లో ముఖ్యమంత్రి, ఆరోగ్య శాఖ మంత్రి, వైద్య ఆరోగ్యశాఖ అధికారులను అనేకసార్లు కలిశామని, వినతి పత్రాలు ఇచ్చామని, అయినా ఎలాంటి స్పందన లేకపోవడంతో అనివార్యంగా ధర్నా చేపట్టామన్నారు. గత ప్రభుత్వంలాగే ఈ ప్రభుత్వం కూడా డబ్బులేవని చేతులెత్తేయడం తగదన్నారు. కార్యక్రమంలో అంగన్వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ జిల్లా గౌరవాధ్యక్షురాలు కె.విజయలక్ష్మి, రైతుసంఘం జిల్లా అధ్యక్ష కార్యదర్శులు కట్టా భాస్కరరావు, కె.శ్రీనివాస్, ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి కె.లెనిన్, సిఐటియు నాయకులు బి.సోమయ్య, జె.గోపి పాల్గొని మద్దతు తెలిపారు. ఆశా యూనియన్ జిల్లా నాయకులు లోకేశ్వరి, కామేశ్వరి, నవ్య, మంగతాయారు, పుల్లమ్మ తదితరులు నాయకత్వం వహించారు. అనంతరం ఆశా యూనియన్ జిల్లా ప్రతినిధి బృందం కలెక్టర్‌కు వినతిపత్రం అందజేసింది.

108 ఉద్యోగుల రిలేదీక్షలు

నినదిస్తున్న 108 ఉద్యోగులు

ప్రజాశక్తి - ఏలూరు అర్బన్

108 అంబులెన్స్ సర్వీసుల్లోని ఉద్యోగులు తమ సమస్యలు పరిష్కరించాలని కోరుతూ 108 కాంట్రాక్ట్ ఎంప్లాయీస్ యూనియన్ (సిఐటియు) ఆధ్వర్యంలో సోమవారం స్థానిక కలెక్టరేట్ వద్ద రిలే నిరాహార దీక్ష చేపట్టారు. ఈ సందర్భంగా యూనియన్ అధ్యక్షులు ఇబ్బ ప్రసాద్ మాట్లాడుతూ 108 అంబులెన్స్ వ్యవస్థను నేరుగా ప్రభుత్వమే నిర్వహించాలని, తమను ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించాలని డిమాండ్ చేశారు. 108 వ్యవస్థలో రోజుకు మూడు షిఫ్టులుగా, ఎనిమిది గంటల పని విధానం అమలు చేయాలన్నారు. 108 సర్వీసుల్లో పని చేస్తున్న ఉద్యోగులకు ప్రభుత్వ నియామకాల్లో వెయిటేజీ మార్కులు అందించాలన్నారు. వైద్యఆరోగ్య శాఖలో ఇఎంటి పోస్టుల నియామకాల్లో 108లో పని చేస్తున్న ఇఎంటిలను నియమించాలన్నారు. సహజ, ప్రమాద మరణం పొందిన ఉద్యోగి కుటుంబానికి రూ.25 లక్షలు ఎక్స్‌గ్రేషియా అందించాలని కోరారు. 108 వాహనాలకు శాశ్వత భవనాలు ఏర్పాటు చేయాలని, ప్రస్తుత నిర్వహణా సంస్థ నుండి ఉద్యోగులకు రావాల్సిన బకాయిలను పూర్తిగా చెల్లించే బాధ్యతను ప్రభుత్వమే చేపట్టాలని విజ్ఞప్తి చేశారు. ఇప్పటికైనా ప్రభుత్వ అధికారులు, యాజమాన్యం స్పందించి తమ సమస్యలు పరిష్కరించని పక్షంలో తప్పనిసరి పరిస్థితుల్లో ఈ నెల 25 తర్వాత సమ్మెకు వెళ్తామని ప్రకటించారు. సమ్మె కారణంగా ప్రజలకు కలిగే అసౌకర్యం, ఇబ్బందులకు యాజమాన్యం, అధికారులే బాధ్యత వహించాల్సి ఉంటుందన్నారు. కార్యక్రమంలో యూనియన్ జనరల్ సెక్రటరీ రమేష్, వర్కింగ్ ప్రెసిడెంట్ నారాయణమూర్తి, వైస్ ప్రెసిడెంట్ ఆర్.శ్రీనివాసరావు, జాయింట్ సెక్రటరీ శివ తదితరులు పాల్గొన్నారు.

పిజిఆర్ఎస్‌లో 245 అర్జీలు స్వీకరణ

వినతులు స్వీకరిస్తున్న కలెక్టర్ వెట్రిసెల్వి

గడువులోగా నాణ్యమైన పరిష్కారం చూపాలి

కలెక్టర్ కె.వెట్రిసెల్వి

ప్రజాశక్తి - ఏలూరు

ప్రజా ఫిర్యాదుల స్వీకరణ, పరిష్కారం కార్యక్రమంలో వచ్చే ప్రజా ఫిర్యాదులకు ప్రాధాన్యతనిస్తూ త్వరితగతిన పరిష్కరించాలని కలెక్టర్ కె.వెట్రిసెల్వి అన్నారు. సోమవారం స్థానిక కలెక్టరేట్‌లోని గోదావరి సమావేశ మందిరంలో నిర్వహించిన ప్రజా ఫిర్యాదుల పరిష్కార వ్యవస్థలో అర్జీదారుల నుంచి 245 దరఖాస్తులు స్వీకరించినట్లు ఆమె తెలిపారు. జాయింట్ కలెక్టర్ పి.ధాత్రిరెడ్డి, డిఆర్ఒ వి.విశ్వేశ్వరరావు, ఆర్‌డిఒ అచ్యుత అంబరీష్, డిఆర్‌డిఎ పీడీ ఆర్.విజయరాజు, డిప్యూటీ కలెక్టర్లు కె.భాస్కరరావు, ఎం.ముక్కంటితో కలిసి ప్రజల నుండి ఫిర్యాదులు స్వీకరించారు. ఈ సందర్భంగా కలెక్టర్ వెట్రిసెల్వి మాట్లాడుతూ పోలీస్ కేసులకు సంబంధించి చట్టప్రకారం చర్యలు తీసుకుని బాధితులకు న్యాయం చేయాలని పోలీస్ అధికారులను ఆదేశించారు. ప్రజా సమస్యల పరిష్కారమే ధ్యేయంగా పిజిఆర్ఎస్ కార్యక్రమం ఉండాలన్నారు.

సైబర్ నేరాలపై అవగాహన అవసరం: కలెక్టర్

ప్రస్తుతం సైబర్ నేరాల పట్ల ప్రతిఒక్కరూ పూర్తి అవగాహన కల్గి ఉండి తగు జాగ్రత్తలు తీసుకోవాలని కలెక్టర్ కె.వెట్రిసెల్వి అన్నారు. సోమవారం స్థానిక కలెక్టరేట్‌లోని గోదావరి సమావేశ మందిరంలో జిల్లా అధికారులకు సైబర్ నేరాలపై అవగాహనా కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ప్రజలు తమ వ్యక్తిగత, బ్యాంకింగ్ వివరాలు అపరిచితులతో పంచుకోవద్దని సూచించారు. సైబర్ నేరాలకు గురైనప్పుడు 1930 టోల్ ఫ్రీ నెంబరుకు డయల్ చేసి సమాచారం అందించాలన్నారు. దీనికి నిర్దేశించిన వెబ్‌సైట్ www.cybercrime.gov.inను సందర్శించవచ్చన్నారు. సైబర్ నేరాలపట్ల అందరికీ అవగాహన కల్పించాలనే ఉద్దేశ్యంతో జిల్లా అధికారులకూ అవగాహనా కార్యక్రమం నిర్వహించిన ఎస్‌పి కె.ప్రతాప్ శివకిషోర్‌కు కలెక్టర్ ధన్యవాదాలు తెలిపారు. సైబర్ క్రైమ్ ఎస్ఐ బి.మధు వెంకటరాజా పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా వివిధ సైబర్ నేరాల తీరును వివరిస్తూ వాటి పట్ల ఏ విధంగా అప్రమత్తంగా ఉండాలో వివరించారు. ఫోన్లలో ఒటిపి, ఒఎల్ఎక్స్, పేటిఎం, గూగుల్ పే, ఫోన్‌పే, కెవైసిలను అప్‌డేట్ చేయమని వచ్చే మెసేజీలను సందర్శించకూడదన్నారు. సోషల్ మీడియాలో వస్తున్న అనేక వెబ్‌సైట్ల ద్వారా సైబర్ నేరగాళ్లు నేరాలకు పాల్పడుతున్నారన్నారు. సెల్‌ఫోన్లో వచ్చే లోన్‌యాప్‌ల జోలికి పోవద్దని ఆయన సూచించారు. సైబర్ నేరాలకు లోనైన బాధితులు వెంటనే పోలీస్ వారికి సంబంధిత వివరాలు అందిస్తే సంబంధిత అక్కౌంట్లను బ్లాక్ చేస్తామన్నారు. ఎవరైనా పోలీస్ అధికారులమని చెప్పి ఫోన్ చేసి బెదిరిస్తే వెంటనే సంబంధిత సమాచారం పోలీసులకు అందించాలన్నారు. సమావేశంలో జాయింట్ కలెక్టర్ పి.ధాత్రిరెడ్డి, డిఆర్ఒ వి.విశ్వేశ్వరరావు, జిల్లా అధికారులు పాల్గొన్నారు.

నేవీ ఆయుధ పరిశ్రమ నిర్మాణం ఆపండి

ఏలూరు ఎంపీకి సిపిఎం బహిరంగ లేఖ

ప్రజాశక్తి - ఏలూరు అర్బన్

జీలుగుమిల్లి మండలం వంకావారిగూడెంలో నేవీ ఆయుధ పరిశ్రమ నిర్మాణాన్ని నిలిపివేయాలని సిపిఎం జిల్లా కమిటీ ఏలూరు ఎంపీ పుట్టా మహేష్‌కుమార్ యాదవ్‌ను కోరింది. ఈ మేరకు ఆ కమిటీ జిల్లా కార్యదర్శి ఎ.రవి సోమవారం ఎంపీకి బహిరంగ లేఖ రాశారు. వంకావారిగూడెంలో 1500 ఎకరాల విస్తీర్ణంలో రూ.రెండు వేల కోట్లతో నేవీకి అవసరమైన ఆయుధాల పరిశ్రమ ఏర్పాటును అక్కడి ప్రజలంతా వ్యతిరేకిస్తున్నారని పేర్కొన్నారు. స్థానికులంతా వద్దని ముక్తకంఠంతో కోరుతున్నా ప్రభుత్వాలు ప్రయత్నించడం తగదని తెలిపారు. వంకావారిగూడెం పంచాయితీలోని ఆరు గ్రామాలకు చెందిన మూడు వేల మంది ప్రజలు నిరాశ్రయులవుతారని, ఇల్లు, భూములు, ఉపాధి కోల్పోతారని తెలిపారు. ఇక పరిశ్రమ స్థాపిస్తే పరిసర గ్రామాల ప్రజలపై నిఘా ఏర్పడి వారు స్వేచ్ఛను కోల్పోతారన్నారు. గాలి, నీరు కాలుష్యమౌతాయని, ఇప్పటికే అశ్వారావుపేటలోని పేపర్ మిల్లు వల్ల ప్రజలు కాలుష్య సమస్య ఎదుర్కొంటున్నారన్నారు. ఈ పరిశ్రమ స్థాపిస్తే ఈ ప్రాంత యువతీ యువకులకు ఉద్యోగాలు, ఉపాధి దక్కుతాయని ప్రభుత్వాలు చెబుతున్నా వాస్తవానికి యువతీ, యువకులకు స్వీపర్, గేట్‌మెన్ వంటి కొద్దిపాటి ఉద్యోగాలు తప్ప ఇంకేమీ రావని, ఇది ప్రయివేటు పరిశ్రమ కాబట్టి ఎటువంటి రిజర్వేషన్లూ పాటించబోరని తెలిపారు. భూమి పరిహారం, ఇల్లుకు ఇల్లు ప్యాకేజీ ఇస్తామని, కోల్పోయిందంతా అందిస్తామని చెబుతున్నారని, అయితే పోలవరం ప్రాజెక్టును ప్రభుత్వం 18 ఏళ్లుగా నిర్మిస్తోందని, దీనివల్ల నిర్వాసితులైన లక్ష కుటుంబాల్లో కేవలం 10 వేల కుటుంబాలకు కూడా పూర్తిస్థాయిలో పునరావాసం కల్పించలేదని గుర్తు చేశారు. దీంతో వారంతా ఉండేందుకు గూడు లేక, ఉపాధి లేక అల్లాడుతున్నారని తెలిపారు. పోలవరం ప్రాజెక్టు, జల్లేరు రిజర్వాయర్, అభయారణ్యం, బొగ్గుగనుల పేరుతో అడవి బిడ్డలను ఆ ప్రాంతం నుండి దూరం చేస్తున్నారని విమర్శించారు. గ్రామ సభల తీర్మానం అంటే అది సుప్రీంకోర్టు తీర్పుతో సమానమని తెలిపారు. ఇప్పటికైనా ఆ ప్రాంత ప్రజల అభీష్టం మేరకు, వారి జీవన విధానం దెబ్బతినకుండా ఉండేందుకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అక్కడ పెట్టదలచిన ఆయుధ పరిశ్రమను నిలిపివేయాలని ఆ లేఖలో కోరారు.

నిర్వాసితుల సమస్యలు పరిష్కరించండి

సిపిఎం జిల్లా కార్యదర్శి ఎ.రవి

ప్రజాశక్తి - కుక్కునూరు

ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన పోలవరం ప్రాజెక్టు పనులపై ఉన్న శ్రద్ధ, ఆ ప్రాజెక్టు కోసం సర్వం త్యాగం చేస్తున్న నిర్వాసితులపై లేదని సిపిఎం జిల్లా కార్యదర్శి ఎ.రవి అన్నారు. మండలంలోని కుక్కునూరులో సిపిఎం 8వ మండల మహాసభ సోమవారం నిర్వహించారు. తొలుత పార్టీ పతాకాన్ని సిపిఎం సీనియర్ నాయకులు పట్ల లక్ష్మయ్య ఆవిష్కరించారు. అనంతరం భయ్యాన శ్రీను, శ్యామల లక్ష్మణరావు, పట్ల సీతక్క అధ్యక్షతన సభ జరిగింది. తొలుత సీతారాం ఏచూరి, రుద్రరాజు సత్యనారాయణ రాజు(ఆర్ఎస్) చిత్రపటాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ముఖ్యఅతిథి రవి మాట్లాడుతూ ప్రభుత్వాలు మారుతున్నా నిర్వాసితుల గోడు పట్టించుకునే వారే కరువయ్యారన్నారు. సంవత్సరాలు తరబడి ప్రాజెక్టు కట్టడమేగాని నిర్వాసితుల సమస్యలు, పునరావాసం, పరిహారం గురించి చర్చే లేదన్నారు. సర్వేల పేరుతో కాలం గడపడమేగాని ఏఒక్క నిర్వాసితునికీ న్యాయం జరగట్లేదన్నారు. ప్రతి సంవత్సరం వరదలు వచ్చినప్పుడల్లా కొండ గుట్టలపై తల దాచుకుని జీవనం సాగించాల్సి వస్తుందని ఆవేదన వ్యక్తం చేశారు. ఇప్పటికైనా కూటమి ప్రభుత్వం స్పందించి నిర్వాసితులకు ఆర్‌అండ్‌ఆర్ ప్యాకేజీ ఇచ్చి, పూర్తి పునరావాసం కల్పించాలని, ఆ తర్వాతే ప్రాజెక్టు పనులు సాగించాలని అన్నారు. ఉచిత ఇసుక పాలసీని పటిష్టంగా అమలు చేయాలన్నారు. అనంతరం మండల కార్యదర్శి యర్రంశెట్టి నాగేంద్రరావు కార్యకలాపాల నివేదికను ప్రవేశపెట్టారు. ఈ కార్యక్రమంలో సిపిఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు, తెల్లం రామకృష్ణ, ఎం.నాగమణి, వేలేరుపాడు మండల కార్యదర్శి ధర్ముల రమేష్, నేతలు యర్నం సాయికిరణ్, మేడిపల్లి బాబు, మడవి దుర్గారావు, కోట రామలక్ష్మి, షేక్ వలిపాషా, పులదాసు రమేష్ పాల్గొన్నారు.

మాట్లాడుతున్న జిల్లా కార్యదర్శి రవి

సిపిఎం మండల కన్వీనర్‌గా పాండు రంగారావు

ప్రజాశక్తి - చింతలపూడి

సిపిఎం మండల కన్వీనర్‌గా పి.పాండురంగారావు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. మండల కమిటీ సభ్యులుగా డి.సత్యనారాయణ, చిన్నం సులేమాన్, కె.అనురాధ, ఎం.వరలక్ష్మి దేవి ఎన్నుకోబడ్డారని సిపిఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు డివిఎన్‌విడి.ప్రసాద్ తెలియజేశారు. ఈ సందర్భంగా కన్వీనర్ పాండురంగారావు మాట్లాడుతూ రాబోవు మూడు సంవత్సరాల కాలంలో మండలంలో సిపిఎంని విస్తరింప చేయడానికి, బలోపేతం చేయడానికి కమిటీ కృషి చేస్తుందని తెలియజేశారు.

నిర్ణీత గడువులోగా ఫిర్యాదులు పరిష్కరించాలి

ఎస్‌పి ప్రతాప్ శివ కిషోర్

ప్రజాశక్తి - ఏలూరు స్పోర్ట్స్

ప్రజలు ఇచ్చిన ఫిర్యాదులను వెంటనే పరిష్కరించేందుకు ప్రత్యేక ప్రణాళికను సిద్ధం చేశామని జిల్లా ఎస్‌పి ప్రతాప్ శివ కిషోర్ అన్నారు. ఏలూరు నగరంలోని జిల్లా పోలీస్ కార్యాలయ సమావేశం మందిరంలో ప్రతి సోమవారం పోలీస్ శాఖ ఆధ్వర్యంలో నిర్వహించే గ్రీవెన్స్ కార్యక్రమాన్ని ఈ సోమవారం కూడా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో జిల్లా ఎస్‌పి ప్రతాప్ శివ కిషోర్, జిల్లా అదనపు ఎస్‌పి నక్క సూర్యచంద్రరావులు సంయుక్తంగా పాల్గొని ఫిర్యాదుదారుల వద్ద నుంచి ఫిర్యాదులను స్వీకరించారు. ఈ కార్యక్రమంలో జిల్లా వ్యాప్తంగా పలు ప్రాంతాల నుంచి దాదాపు 40 మంది ఫిర్యాదుదారులు తమ తమ సమస్యలను జిల్లా ఎస్‌పికి విన్నవించారు. ఈ సమస్యలపై ఎస్‌పి సంబంధిత అధికారులతో ఫోన్లో సంభాషించి సమస్యలను వెంటనే పరిష్కరించాలని ఆదేశించారు.

చిన్నారులకు మిఠాయిలు పంచిన జిల్లా ఎస్‌పి

గ్రీవెన్స్ కార్యక్రమానికి వచ్చిన ఫిర్యాదుదారులు తమ వెంట చిన్నారులను కూడా తీసుకొని వచ్చారు. అది గుర్తించిన ఎస్‌పి జిల్లా పోలీస్ కార్యాలయంలోని సమావేశ మందిరంలో ఆ చిన్నారులకు మిఠాయిలు పంచిపెట్టారు.

నూజివీడు టౌన్ : ప్రజా సమస్యల పరిష్కార వేదిక(పబ్లిక్ గ్రీవెన్స్ రెడ్రెసల్ సిస్టం) ఫిర్యాదులను నిర్ణీత గడువు లోగా సకాలంలో విచారణ జరిపి చట్ట పరిధిలో న్యాయం చేస్తామని ఎస్‌పి ప్రతాప్ శివ కిషోర్ అన్నారు. నూజివీడు టౌన్ పోలీస్ స్టేషన్‌లో సోమవారం నిర్వహించిన 'ప్రజా సమస్యల పరిష్కార వేదిక(పబ్లిక్ గ్రీవెన్స్ రెడ్రెసల్ సిస్టం) కార్యక్రమంలో ఆయన ఫిర్యాదులను స్వీకరించారు. దూర ప్రాంతాల నుంచి జిల్లా పోలీస్ కార్యాలయానికి రాలేని వారు ప్రతి సోమవారం మీకు దగ్గరలోని సర్కిల్ ఆఫీస్, డిఎస్‌పి కార్యాలయాల్లో జరిగే ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమంలో ఫిర్యాదు చేయవచ్చని, వాటిని కూడా పబ్లిక్ గ్రీవెన్స్ ఫిర్యాదులు గానే పరిగణించి సకాలంలో న్యాయం జరిగేలా చర్యలు తీసుకుంటామని ఎస్‌పి తెలిపారు.

నేడు కలెక్టర్ పర్యటన

ఉంగుటూరు : జిల్లా కలెక్టర్ వెట్రిసెల్వి అక్కుపల్లి గోకవరంలో మేకల పెంపకం షెడ్డు పరిశీలించేందుకు ఈనెల 19న రానున్నారని మండల పశువైద్య అధికారి పప్పు అశోక్‌కుమార్ వెల్లడించారు. ప్రభుత్వం పశు పోషకులకు రాయితీ ఇచ్చి షెడ్డు నిర్మించిన వాటిని పరిశీలించేందుకు ఆమె రానున్నట్లు సమాచారం.

ఎకరాకు రూ.50 లక్షలు పరిహారమివ్వాలి

కలెక్టరేట్ వద్ద 'చింతలపూడి' భూ నిర్వాసితుల ధర్నా

కలెక్టరేట్ వద్ద నినదిస్తున్న చింతలపూడి ఎత్తిపోతల నిర్వాసిత రైతులు

ప్రజాశక్తి - ఏలూరు అర్బన్

చింతలపూడి ఎత్తి పోతల పథకం భూనిర్వాసిత రైతులకు 2015, 2016ల్లో ఇచ్చిన అవార్డు రద్దు చేసి కొత్త అవార్డు ప్రకారం పరిహారం చెల్లించాలని, ఎకరాకు రూ.50 లక్షల పరిహారం ఇచ్చి న్యాయం చేయాలని డిమాండ్ చేస్తూ చింతలపూడి ఎత్తిపోతల పథకం భూనిర్వాసిత రైతుల పోరాట కమిటీ ఆధ్వర్యంలో స్థానిక కలెక్టరేట్ వద్ద సోమవారం ధర్నా నిర్వహించారు. ప్రయివేటు మార్కెట్ ధర ప్రకారం పరిహారం చెల్లించాలని, కొత్త అవార్డు ఇవ్వాలని, భూములు కోల్పోతున్న రైతులకు న్యాయం చేయాలని నినాదాలు చేశారు. ఈ సందర్భంగా ఎపి రైతుసంఘం జిల్లా కార్యదర్శి కె.శ్రీనివాస్, ఎపి కౌలు రైతుల సంఘం జిల్లా కార్యదర్శి దొంతా కృష్ణ, చింతలపూడి ఎత్తిపోతల పథకం భూనిర్వాసిత రైతుల పోరాట కమిటీ నాయకులు ఎస్.వరలక్ష్మి, కుప్పాల చెన్నయ్య మాట్లాడారు. 2015, 2016ల్లో భూసేకరణకు నోటిఫికేషన్లు ఇచ్చి అవార్డు ఇచ్చారని, ప్రభుత్వం వద్ద నిధులు లేవనే పేరుతో తొమ్మిది సంవత్సరాల తర్వాత పాత అవార్డు ప్రకారం పరిహారం ఇస్తామని ప్రభుత్వం చెప్పడం అన్యాయమన్నారు. తొమ్మిది సంవత్సరాలుగా భూమి విలువ అనేక రెట్లు పెరిగిందన్నారు. పాత అవార్డు ప్రకారమైతే రైతు కోల్పోయిన భూమికి ఎకరాకు ప్రయివేట్ మార్కెట్ ధర ప్రకారం పావు ఎకరం కూడా రాదన్నారు. ప్రయివేట్ మార్కెట్ ధరకు అనుగుణంగా ఎకరాకు రూ.50 లక్షలు పరిహారం చెల్లించాలని డిమాండ్ చేశారు. పామాయిల్, కొబ్బరి, టేకు తదితర చెట్లు, షెడ్లు, బోర్లకు తగిన పరిహారం అందించాలన్నారు. ఎత్తిపోతల పథకం పరిధిలో ఉన్న చెరువులు, కుంటలకు నీళ్లిచ్చే విధంగా డిజైన్ మార్పు చేయాలన్నారు. చింతలపూడి ఎత్తిపోతల పనులు వెంటనే పూర్తి చేసి మెట్ట ప్రాంత భూములకు సాగునీరు అందించాలని కోరారు. అనంతరం కలెక్టర్ వెట్రిసెల్వికి భూనిర్వాసిత రైతులు వినతిపత్రం అందజేశారు. భూములు కోల్పోతున్న రైతులతో స్వయంగా సమావేశం నిర్వహించి వారి అభిప్రాయాలు సేకరించి న్యాయం చేస్తామని ఈ సందర్భంగా కలెక్టర్ హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో రైతుసంఘం జిల్లా అధ్యక్షులు కట్టా భాస్కరరావు, భూనిర్వాసిత రైతులు జగ్గవరపు ప్రసాద్‌రెడ్డి, మావూరి సత్యనారాయణరెడ్డి, భీమిరెడ్డి మాధవరెడ్డి, కటారి చెన్నయ్య, కె.ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

పద్మకుమారి స్నేహశీలి, సమాజ సేవకురాలు

ఐద్వా రాష్ట్ర కార్యదర్శి డి.రమాదేవి - ముగిసిన అంత్యక్రియలు

ప్రజాశక్తి - ఏలూరు

రావి పద్మకుమారి స్నేహశీలి, సమాజ సేవకురాలు అని ఐద్వా రాష్ట్ర కార్యదర్శి డి.రమాదేవి కొనియాడారు. సోమవారం ఉదయం డాక్టర్ రావి గోపాలకృష్ణయ్య సతీమణి రావి పద్మకుమారి అంత్యక్రియలు నిర్వహించారు. వీటిలో రమాదేవి, ఐద్వా నాయకులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా రమాదేవి మాట్లాడుతూ జిల్లా ప్రభుత్వాసుపత్రి మాజీ సూపరింటెండెంట్ డాక్టర్ రావి గోపాలకృష్ణయ్య భార్య పద్మకుమారి అనారోగ్యం వల్ల అకస్మాత్తుగా మృతి చెందడం బాధాకరమన్నారు. సిపిఎం, కమ్యూనిస్టు అభిమాని అయిన గోపాలకృష్ణయ్య ప్రముఖ వైద్యులు, సేవాతత్పరులుగా పేరొందారని గుర్తు చేశారు. తన వృత్తి జీవితంలో అనేకమంది ప్రజలకు వైద్య సహాయాన్ని అందించారని తెలిపారు. భర్త గోపాలకృష్ణయ్యతో కలిసి అనేక సేవా కార్యక్రమాల్లో పద్మకుమారి పాలుపంచుకునే వారన్నారు. పేద విద్యార్థులు, మహిళల కోసం సాధన ఛారిటబుల్ ట్రస్ట్ ఏర్పాటు చేసి సహాయ కార్యక్రమాలు చేపడుతున్నారని కొనియాడారు. ఈ సమయంలో అకస్మాత్తుగా పద్మకుమారి మృతి చెందడం తీవ్ర దిగ్భ్రాంతిని కలిగించిందని ఆవేదన వ్యక్తం చేశారు. కార్యక్రమంలో ఐద్వా జిల్లా అధ్యక్ష కార్యదర్శులు పి.హైమావతి, ఎ.శ్యామలారాణి, నాయకులు జి.శారద, పి.ఉషారాణి, కె.కల్పన, సిహెచ్.రాజ్యలక్ష్మి పాల్గొన్నారు.

పద్మ కుమారి మృతి పట్ల ఐద్వా సీనియర్ జిల్లా నాయకురాలు గారపాటి విమల, గుత్తికొండ విజయ తదితరులు సంతాపం తెలిపి, కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలిపారు.

పద్మకుమారి భౌతికకాయం వద్ద నివాళి అర్పిస్తున్న నేతలు

కళ్యాణ్ కుటుంబానికి రూ.25 లక్షల ఎక్స్‌గ్రేషియా ప్రకటించాలి: డివైఎఫ్ఐ

జంగారెడ్డిగూడెం : పామాయిల్ గెలలు కోస్తూ విద్యుత్ తీగలు తగలడంతో అక్కడికక్కడే మృతి చెందిన కార్మికుడు తగరం కళ్యాణ్ కుటుంబాన్ని ప్రభుత్వం ఆదుకుని, తక్షణమే రూ.25 లక్షల ఎక్స్‌గ్రేషియా ప్రకటించాలని డివైఎఫ్ఐ జిల్లా కార్యదర్శి జి.సూర్యకిరణ్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. సోమవారం ప్రజాసంఘాల కార్యాలయంలో డివైఎఫ్ఐ సమావేశంలో ఆయన మాట్లాడుతూ మండలంలోని శ్రీనివాసపురం గ్రామానికి చెందిన తగరం కళ్యాణ్ పామాయిల్ గెలలు కోయడానికి పనికి వెళ్లాడన్నారు. పామాయిల్ గెలలు కోసే సందర్భంలో విద్యుత్ తీగలు తగలడంతో అక్కడికక్కడే మృతి చెందాడన్నారు. మృతుని కుటుంబాన్ని ప్రభుత్వం ఆదుకోవాలని డిమాండ్ చేశారు. రాష్ట్రంలో కూటికోసం కూలీకి వెళ్లే ఉపాధి కూలీలు, వ్యవసాయ కూలీలు ప్రమాదాలకు గురి అవుతున్నారని దీంతో అనేక కుటుంబాలు రోడ్డున పడుతున్నాయన్నారు. రూ.500 నుంచి 700కు కూలీకి వెళ్లి ప్రాణాలు కోల్పోతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. కార్మికులకు ప్రమాదం జరిగితే వారి కుటుంబానికి ఎక్స్‌గ్రేషియా భరోసా కల్పించాలని, అలాగే లేబర్ చట్టాల ప్రకారం వారి కుటుంబాలని ప్రభుత్వం ఆదుకోవాలని డిమాండ్ చేశారు. ఇటువంటి ఘటనలు పునరావృతం కాకుండా చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు. ఎ.ప్రభాకరరావు, ఎన్.నాని, ఆశీర్వాదం పాల్గొన్నారు.

ప్రజాశక్తి
www.prajasakti.com

వీధి కుక్కలకు వింత వైరస్!

భయభ్రాంతుల్లో గ్రామస్తులు

పట్టించుకోని అధికారులు

ప్రజాశక్తి - చింతలపూడి

మండల వ్యాప్తంగా కుక్కలు ప్రజలను తీవ్ర భయభ్రాంతులకు గురిచేస్తున్నాయి. ఆ గ్రామం, ఈ గ్రామం అనే తేడా లేకుండా గుంపులు, గుంపులుగా రోడ్లపై తిరుగుతూ చిన్న పిల్లలు, మహిళలు, వృద్ధులు, సైకిల్, ద్విచక్రవాహనదారులను వెంబడించి పరుగు పెట్టిస్తున్నాయి. వీధికుక్కల స్వైర విహారంతో ప్రజలు బెంబేలెత్తుతున్నారు. రాత్రివేళల్లో రోడ్లపైకి గుంపులు గుంపులుగా వచ్చి రోడ్లపై నుంచి వెళ్లే వారిపై దాడులు చేస్తుండడంతో కుక్కలు కనబడితే చాలు తీవ్ర భయాందోళనకు గురవుతున్నారు. రాత్రిపూట ప్రయాణించే ద్విచక్ర వాహన చోదకులను ఎక్కడో ఒక చోట వీధి కుక్కలు వెంబడించి, గాయపరిచిన సంఘటనలు జరుగుతూనే ఉన్నాయి.

మండలంలో వీధి కుక్కలు ఒక రకమైన వింత వైరస్‌తో ఇబ్బందులు పడుతున్నాయి. ఈ వైరస్ వల్ల కుక్కలకు చర్మంపైన ఉన్న వెంట్రుకలు రాలిపోతున్నాయి. తరువాత తోలు ఊడిపోతుంది, ఒక రకంగా కనిపిస్తున్నాయి. తరవాత ఆ కుక్క వింత చేష్టలు చేసి రోడ్డుపై చచ్చిపోతున్నాయి. సంబంధిత అధికారులు చర్యలు తీసుకోకపోతే, ఈ కుక్కలు మనుషులను కరిస్తే ప్రమాదం జరుగుతుందని, ఈ వ్యాధి ప్రజలకు సోకి ప్రజలు కూడా ఇబ్బందులు పడతారని గ్రామస్తులు భయాందోళన



చర్మంపై తోలు ఊడిపోయి వింతగా ఉన్న కుక్క

చెందుతున్నారు. రోగాల బారిన పడే అవకాశం ఉందని వాపోతున్నారు. అధికారులు దృష్టిలో పెట్టుకొని మండల పరిధిలో ఉన్న కుక్కలకు ముందుగా పరీక్షలు చేయించి, ఏ వ్యాధి సోకిందని తెలుసుకున్న తరువాత కుదిరితే వాటికి యాంటీ డోస్ ఇప్పించాలని కోరుతున్నారు.

గ్రంథాలయంలో వక్తృత్వ పోటీలు

ఏలూరు సిటీ : జిల్లా కేంద్ర గ్రంథాలయంలో 57వ జాతీయ గ్రంథాలయ వారోత్సవాలను సోమవారం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో భాగంగా హేలాపురి లయన్స్ క్లబ్ ప్రెసిడెంట్ పి.వి.రమణ ఆధ్వర్యంలో వివిధ పాఠశాలలకు చెందిన విద్యార్థులకు గ్రంథాలయాల ప్రాముఖ్యత అనే అంశంపై వ్యాసరచన పోటీలు నిర్వహించారు. అనంతరం వివిధ కళాశాలల, పాఠశాలల విద్యార్థులకు డిజిటల్ రీడింగ్ వర్సెస్ బుక్ రీడింగ్ అనే అంశంపై వక్తృత్వ పోటీలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో హేలాపురి లయన్స్ క్లబ్ సభ్యులు, శ్రీలక్ష్మీ నాగేశ్వరరావు నియర్ డ్రాయింగ్ టీచర్, గ్రంథాలయ సిబ్బంది పాల్గొన్నారు.

పెదపాడు : పెదపాడు శాఖా గ్రంథాలయంలో 57వ జాతీయ గ్రంథాలయ వారోత్సవాల్లో భాగంగా సోమవారం ఉదయం 10 గంటలకు పదవ తరగతి విద్యార్థులకు జనరల్ నాలెడ్జ్ మీద 'క్విజ్ పోటీలు' నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పెదపాడు సెంట్ ఆగస్టీన్ ఇంగ్లీష్ మీడియం హైస్కూల్, పెదపాడు జెడ్‌పి హై స్కూలు, కొత్తూరు జెడ్‌పి హై స్కూల్ విద్యార్థులు పాల్గొన్నారు. ఈ కార్యక్రమం నిర్వాహకులుగా జనిత సుల్న హెచ్ఎం వి.విజయలక్ష్మి, ఎంపి పోజియా, సిహెచ్.శిరీష గారు, కె.జోషేలా వ్యవహరించారు. విద్యార్థులకు స్వీట్స్ పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంతా గ్రంథాలయాధికారి దగ్గిపోగు జాన్‌బాబు పర్యవేక్షణలో నిర్వహించారు.

ముసునూరు: గ్రంథాలయ వారోత్సవాల్లో భాగంగా సోమవారం మండలంలోని ముసునూరు భారతీయ విద్యా నికేతన్ పాఠశాలలో, గురుకుల బాలికల పాఠశాలలో ఆయా పాఠశాల ప్రధానోపాధ్యాయుల ఆధ్వర్యంలో క్విజ్, వక్తృత్వం, వ్యాసరచన పోటీలు నిర్వహించారు. వాటిలో ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు ఈనెల 20వ తేదీన ప్రథమ, ద్వితీయ, తృతీయ బహుమతులు అందజేయడం జరుగుతుందని గ్రంథాలయ అధికారిణి టి.రాజేశ్వరి తెలిపారు.

ముదినేపల్లి : మండలంలోని గురజ, ముదినేపల్లి శాఖ గ్రంథాలయాల్లో జరుగుతున్న జాతీయ గ్రంథాలయ వారోత్సవాల్లో సోమవారంతో ఐదో రోజుకు చేరాయి. ఈ సందర్భంగా అన్ని పాఠశాలల విద్యార్థులకు క్విజ్ పోటీలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో జి.రామమోహనరావు, కె.వెంకట సుబ్బారావు, నవీన్, విద్యార్థులు పాల్గొన్నారు, మధ్యాహ్నం వికాస్ ఇంటర్ విద్యార్థులకు 'సమాజ సేవలో యువత భాగస్వామ్యం' అనే అంశంపై వ్యాసరచన పోటీలు నిర్వహించారు. ముఖ్య అతిథిగా ఎంపిడిఓ యద్దనపూడి రామకృష్ణ అధ్యక్షత వహించారు.

కలిదిండి : స్థానిక శాఖా గ్రంథాలయంలో 57వ జాతీయ గ్రంథాలయ వారోత్సవాల్లో భాగంగా 8, 9, 10 తరగతుల విద్యార్థులకు పర్యావరణ పరిరక్షణ అనే అంశంపై పోటీలు నిర్వహించగా శ్రీ సూర్య విద్యార్థి బి.రాకేష్ ప్రథమ, జిల్లా పరిషత్ హై స్కూల్ విద్యార్థి ఇ.వైష్ణవి ద్వితీయ, కలిదిండి పబ్లిక్ స్కూల్ విద్యార్థి ఎ.లిఖిత, వివేకానంద హైస్కూల్ విద్యార్థి వి.కార్తీక్ తృతీయ స్థానాలలో నిలిచినట్లు శాఖ గ్రంథాలయాధికారి జె.రమేష్ బాబు తెలిపారు. ఉపాధ్యాయులు చంద్రయ్య, కిరణ్, కె.సన్నీ బాబు, సాహితీ మిత్రులు చక్కా జగన్నాథరావు పాల్గొన్నారు.

నూజివీడు : 57వ జాతీయ గ్రంథాలయ వారోత్సవాలలో భాగంగా ప్రథమశ్రేణి గ్రంథాలయం, నూజివీడులో కవి సమ్మేళనం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ప్రముఖ కవులు ఈమని శేషయ్య, దారామోహనరావు, ఎంఎస్.ప్రసాద్, పిఎస్ఎన్.రాజారావు, జడా సుబ్బారావు, నారాయణపురపు కుమార్ వర్మ, వడవ కవితలతో, గేయకవితలతో కార్యక్రమ ఆద్యంతం ఘనంగా నిర్వహించారు. రిటైర్డ్ ఎంప్లాయిస్ యూనియన్ అధ్యక్షులు గోవిందరావు, ప్రముఖులు పాల్గొని కవులను వారి చేతుల మీదుగా సన్మానించారు. గ్రంథాలయ పాఠకులతో పాటుగా పాఠశాలల విద్యార్థులు పాల్గొన్నారు.

సబ్ జైలు సందర్శన

చింతలపూడి : ఉమ్మడి జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి కె.రత్నప్రసాద్ సోమవారం కారాగారం పర్యవేక్షించారు. నిందితుల కేసు వివరాలు, వారికి అందిస్తున్న ఆహార పదార్థాలు, మంచినీటి సౌకర్యాలు, ఆరోగ్యంగా ఉన్నవారికి అందించే వైద్య సదుపాయాలు తదితర విషయాలు ముద్దాయిలను అడిగి తెలుసుకున్నారు. ఉచిత న్యాయ సలహాలు, జైలు ముద్దాయిలు అందించిన సహాయంపై ఆరా తీశారు. అందరూ బాధ్యతగా పనిచేయాలని ఈ సందర్భంగా అన్నారు. వంటశాల స్టోర్ రూమ్‌ను తనిఖీ చేశారు. ఈ కార్యక్రమంలో ఉప కారాగార పర్యవేక్షణాధికారి కృపానందం, జైలు సిబ్బంది, ప్రెసిడెంట్ లీగల్ క్లినిక్ న్యాయవాది ఏసుపాదం, పిఎల్‌వి అక్బర్ అలీ పాల్గొన్నారు.

భూసేకరణ దరఖాస్తుల పరిశీలన

జీలుగుమిల్లి : మండలంలోని తాటియాకులగూడెం నుంచి పట్టిసీమ వరకు నూతనంగా నిర్మించనున్న ఎన్‌హెచ్ 365 బిబి జాతీయ రహదారి విస్తరణలో భాగంగా జీలుగుమిల్లి ప్రధాన కూడలిలో రింగ్ రోడ్‌కి సంబంధించి సర్వే చేసిన వ్యాపార కిరాణా దుకాణల భూసేకరణ రికార్డులను సోమవారం సాయంత్రం ఇన్‌ఛార్జి తహశీల్దార్ స్లీవజోజి క్షేత్రస్థాయిలో పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇటీవల జిల్లా జాయింట్ కలెక్టర్ ధాత్రి రెడ్డి ఆధ్వర్యంలో జరిగిన గ్రామసభలో పెండింగ్‌లో ఉన్న పలు దరఖాస్తులను పరిశీలించినట్లు తెలిపారు. త్వరలోనే రెండో గ్రామసభ ఏర్పాటు చేయనున్నట్లు ఇన్‌ఛార్జి తహశీల్దార్ తెలిపారు.

ఘనంగా భక్త కనకదాసు జయంతోత్సవాలు

ఏలూరు సిటీ : భక్త కనకదాసు జయంతి ఉత్సవాలు ఏలూరు జిల్లా వెనుకబడిన తరగతుల సంక్షేమ కార్యాలయంలో సోమవారం ఘనంగా నిర్వహించారు. జిల్లా వెనుకబడిన తరగతుల సంక్షేమ అధికారి ఆర్.నాగరాణి, బిసి కార్పొరేషన్ ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్ పుష్పలత భక్త కనకదాసు చిత్రపటానికి పూలమాల వేసి ఘనంగా నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా నాగరాణి మాట్లాడుతూ భక్త కనకదాసు సమాజంలో వర్గ విభేదాలు, కుల వ్యవస్థకు వ్యతిరేకంగా పోరాడారని, సమాజంలో ధనిక, పేద వర్గాల మధ్య తారతమ్యాలను రూపుమాపడానికి తన సామాజిక రచనల ద్వారా ఎంతో కృషి చేశారన్నారు. ఈ కార్యక్రమంలో సహాయ వెనుకబడిన తరగతుల సంక్షేమ శాఖాధికారి వెంకటేశ్వర్లు, కార్యాలయ సిబ్బంది చిట్టిబాబు, తిరుపతిరావు, బిసి కార్పొరేషన్‌కు చెందిన సిబ్బంది పాల్గొన్నారు.

పిఒఎ చట్టంపై వర్క్ షాప్

పోలవరం : దళిత, గిరిజనులను చైతన్య పరచడానికి ఆంధ్రప్రదేశ్ నేర పరిశోధన విభాగం అదనపు ఎస్‌పి ఆస్తమా ఫర్వీన్ ఆదేశాలతో అవేర్ నెస్ కార్యక్రమాలను నిర్వహిస్తున్నట్లు నేర పరిశోధన విభాగపు సిఐలు కృపానందం, అద్దంకి శ్రీనివాసరావులు తెలియజేశారు. సోమవారం పోలవరం పోలీస్ స్టేషన్‌లో ఎస్ఐ ఎస్ఎస్.పవన్ కుమార్‌తో కలిసి స్థానిక నాయకులు సొబ్బన మోహన్, కుంజం నాగబాబుతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఈనెల 21వ తేదీన పోలవరం సమీపంలోని కన్నాపురం అడ్డరోడ్డు వద్ద ఎస్ఎస్ఎస్ కళ్యాణ మండపంలో అట్రాసిటీ చట్టం, హక్కులు, సామాజిక అంశాలపై ఒక్కరోజు వర్క్ షాప్‌ను నిర్వహిస్తున్నట్లు తెలియజేశారు.

నేరాలు - ఘోరాలు

వ్యాన్ బోల్తాపడి వ్యక్తి మృతి

కలిదిండి : మహీంద్రా వ్యాన్‌లో ఇండెన్ గ్యాస్ బండలు డెలివరి చేస్తున్న స్థానిక 1వ వార్డు కాలనీకి చెందిన పోసిన శివ నాగరాజు(28) ప్రమాదవ శాత్తు మృతి చెందాడు. మండలంలోని కొత్తూరులో ఈ ఘటన చోటుచేసుకుంది. వివరాల ప్రకారం మృతుడు శివ నాగరాజు మూలలంక నుంచి కొత్తూరు వస్తున్న క్రమంలో గ్యాస్ బండను ఇచ్చేందుకు వ్యాన్ పైకి ఎక్కాడు. వ్యాన్ కదిలి ముందుకు వెళ్లడంతో వ్యాన్‌ను ఆపే ప్రయత్నం చేసే లోగానే పంట కాలువలోకి వెళ్లిపోవడం, వ్యాన్ తిరగబడి నాగరాజుపై పడిపోవడం జరిగిందన్నారు. వ్యాన్ కింద పడ్డ నాగరాజు అక్కడికక్కడే మృతి చెందాడు. మృతునికి ఇటీవలే పెళ్లయ్యింది. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ వి.వెంకటేశ్వరరావు తెలిపారు.

నాటుసారా స్థావరాలపై దాడి

పలువురిపై కేసు

చింతలపూడి : నాటు సారా స్థావరాలపై దాడులు నిర్వహించినట్లు ఎక్సైజ్ సిఐ పి.అశోక్ తెలిపారు. ఆయన తెలిపిన వివరాల ప్రకారం మండలంలోని నాగిరెడ్డిగూడెం గ్రామంలో నాటు సారాయి స్థావరాలపై దాడులు నిర్వహించగా నాగిరెడ్డిగూడెం గ్రామానికి చెందిన దేశావతు బాలు నుంచి 2 లీటర్ల నాటు సారాయితో అదుపులోకి తీసుకుని స్థానిక ఎక్సైజ్ స్టేషన్ చింతలపూడిలో కేసు నమోదు చేసినట్లు తెలిపారు. తదుపరి తాళార్లపల్లి గ్రామంలో సారాయి పరారీ నిందితురాలుగా ఉన్న దేశావతు సైదాను అదుపులోకి తీసుకున్నట్లు తెలిపారు. పంతంగులగూడెంలో 2 లీటర్ల నాటుసారాను, 800 లీటర్లు పులిసిన బెల్లపు ఊటను ధ్వంసం చేసి దారవతు బాబురావు అను వ్యక్తిపై పరారీ కేసు నమోదు చేసినట్లు తెలిపారు. గురుబట్లగూడెంలో బెల్ట్ షాపు నిర్వాహకుల కేసులో నిందితులైన నాయుడు వేంకటేశ్వరరావు, కొరిపల్లి శ్రీరామమూర్తిలను 129 బిఎన్ఎస్ఎస్ చట్టం ప్రకారం ఎగ్జిక్యూటివ్ మేజిస్ట్రేట్ తహశీల్దార్ చింతలపూడి వారి ఎదుట హాజరు పరచి బైండ్ ఓవర్ నమోదు చేసినట్లు తెలిపారు. ఈ దాడులలో స్థానిక చింతలపూడి ఎక్సైజ్ ఎస్ఐలు ఆర్‌విఎల్.నరసింహా రావు, అబ్దుల్ ఖలీల్, సిబ్బంది పాల్గొన్నారు.

ప్రజాశక్తి
ప్రతి అక్షరం - ప్రజల పక్షం
పత్రిక పంపిణీలో ఇబ్బందులున్నవారు ఈక్రింది నెంబర్లను సంప్రదించండి
ఏలూరు జిల్లా సర్క్యులేషన్ వివరాల కోసం సెల్: 94900 99190
పశ్చిమగోదావరి జిల్లా సర్క్యులేషన్ వివరాల కోసం సెల్: 83339 88814

ప్రెసిడెంట్ కరాటే కప్‌లో చింతలపూడి కుర్రాడి ప్రతిభ

చింతలపూడి : విజయవాడలోని చెన్నుపాటి రామకోటయ్య స్టేడియంలో జరిగిన ప్రెసిడెంట్ కరాటే కప్ 2024లో చింతలపూడి స్పోర్ట్స్ కరాటే అకాడమికి చెందిన బి.జస్వంత్ అండర్-14 45 కేజీల విభాగంలో సిల్వర్ మెడల్ సాధించినట్లు కోచ్ పి.సుమన్ రాజు తెలిపారు. ఈ ప్రెసిడెంట్ కరాటే కప్‌లో 12 జిల్లాల నుంచి 800 మంది క్రీడాకారులు పాల్గొన్నారని తెలిపారు.

సైబర్ నేరాల పట్ల అప్రమత్తంగా ఉండాలి : ఎస్‌పి

నూజివీడు టౌన్ : సైబర్ నేరాలు రోజురోజుకీ పెరుగుతున్నాయని, వాటి పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని జిల్లా ఎస్‌పి ప్రతాప్ శివ కిషోర్ సూచించారు. సాధారణ తనిఖీల్లో భాగంగా నూజివీడు పట్టణ పోలీస్ స్టేషన్‌కు సోమవారం ఆయన విచ్చేశారు. నూజివీడు డిఎస్‌పి ప్రసాద్, పట్టణ సిఐ పి.సత్య శ్రీనివాస్, రూరల్ సిఐ రామకృష్ణలు ఎస్‌పికి సాదర స్వాగతం పలికారు. ఈ సందర్భంగా ఎస్‌పి మాట్లాడుతూ ఇటీవల కాలంలో సైబర్ నేరాల రూపం రోజురోజుకీ మారుతోందన్నారు. నూజివీడు రూరల్ పోలీస్ స్టేషన్ వద్ద గతంలో సిసిఎస్ స్టేషన్ ఉండే అంశాన్ని ఎస్‌పి వద్ద ప్రస్తావించగా, తాను పరిశీలించి అవకాశం ఉన్నంతవరకు గతంలో ఉన్న సౌకర్యాలను పునరుద్ధరించే కార్యక్రమం చేపడతామన్నారు. ఈ కార్యక్రమంలో డిఎస్‌పి ప్రసాద్, పట్టణ, నూజివీడు రూరల్ సిఐలు పి.సత్య శ్రీనివాస్, రామకృష్ణ పాల్గొన్నారు.

నారాయణపురంలో ఆక్రమణలు తొలగింపు

బాధితుల ఆందోళన

ప్రజాశక్తి - ఉంగుటూరు

నారాయణపురం - గణపవరం ఆర్అండ్‌బి రహదారి ఇరువైపులా నారాయణపురం బజారులో ఆక్రమణలను సోమవారం అధికారులు పోలీసు బందోబస్తు మధ్య తొలగించేశారు. స్థానిక కృష్ణుడి గుడి సమీపంలో కట్టడాల తొలగింపులో అధికారులు ఇష్టానుసారంగా తమ సొంత భూమిలో కట్టిన కట్టడాలను సైతం కూల్చేశారని గురువెళ్లి ప్రసాద్, తదితరులు ఆవేదన వ్యక్తం చేశారు. మూడు చోట్ల మార్కింగులు వేశారని, ఏ మార్కింగును ప్రాతిపదికన తీసుకున్నారో తమకు సమాచారం ఇవ్వకుండా యంత్రాల సాయంతో కూలకొట్టేశారని బాధితులు ఆవేదన చెందుతున్నారు. కాగా ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా పోలీసులు పకడ్బందీ చర్యలు తీసుకోవడంతో ఎక్కడా అల్లర్లు, ప్రతిఘటనలు లేకుండా సజావుగా ఆక్రమణలు తొలగించామని ఎంపిడిఒ రాజ్‌మనోజ్ చెప్పారు.

టిడిపి సత్తా చూపించాలి : ఎంపీ మహేష్

ప్రజాశక్తి - జీలుగుమిల్లి

జీలుగుమిల్లిలో సోమవారం టిడిపి సభ్యత్వ నమోదు కార్యక్రమంలో ఏలూరు ఎంపీ పుట్టా మహేష్ కుమార్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జీలుగుమిల్లిలో ఇప్పటి వరకు టిడిపి వెనకంజలో ఉందని, త్వరలోనే అత్యధిక సభ్యత్వాలు చేయించి మండలంలో టిడిపి సత్తా చూపించాలని శ్రేణులకు దిశా నిర్దేశం చేశారు. పోలవరం ప్రాజెక్టు నిర్వాసితుల సమస్యలను ముఖ్యమంత్రి దృష్టికి తీసుకు వెళ్లి నిర్వాసిత సమస్యల పరిష్కారానికి తన వంతు కృషిచేస్తానని హామీ ఇచ్చారు. అనంతరం కార్యకర్తల నుంచి ఫిర్యాదులు స్వీకరించారు. ఈ కార్యక్రమంలో ట్రైకార్ చైర్మన్ బొరగం శ్రీనివాస్, పారేపల్లి రామారావు, నాయకులు సాయి, సాంబ, సురేంద్ర, సోమసుందర్ పాల్గొన్నారు.

టి.నరసాపురం : పోలవరం నియోజకవర్గంలో సమస్యల పరిష్కారానికి ముందుంటానని ఏలూరు ఎంపీ పుట్టా మహేష్ కుమార్ అన్నారు. స్థానిక విజయలక్ష్మి థియేటర్ వద్ద ఏర్పాటుచేసిన టిడిపి సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని సోమవారం ఎంపీ ప్రారంభించారు. ఈ సందర్భంగా జరిగిన కార్యకర్తలు, నాయకుల ఆత్మీయ సమావేశంలో ఎంపీ మహేష్ కుమార్ మాట్లాడుతూ అధికారులు ఇష్టం వచ్చినట్లు పనిచేస్తే శాఖాపరమైన చర్యలు తప్పవని హెచ్చరించారు. అనంతరం ప్రజల నుంచి అర్జీలు స్వీకరించారు. ట్రైకార్ చైర్మన్ బొరగం శ్రీనివాసులు, స్థానిక నాయకులు రామకృష్ణ గౌడ్, శీలం వెంకటేశ్వరరావు, జయవరపు శ్రీరామమూర్తి, చలపతిరావు పాల్గొన్నారు.

ధాన్యం కొనుగోలు ప్రారంభం

ప్రజాశక్తి - ముసునూరు

ప్రభుత్వం రైతు సేవా కేంద్రాల ద్వారా ధాన్యం కొనుగోలు ప్రారంభించినట్లు మండల వ్యవసాయాధికారి ఎస్.మధుమోహన్ అన్నారు. సోమవారం మండలంలోని చింతలవల్లి శివారు గోగులంపాడు గ్రామంలో ధాన్యం కొనుగోలు కేంద్రం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ధాన్యంలో తేమశాతం 17 కన్నా తక్కువ ఉండాలని, రంగు మారినా, మొలకెత్తినా, పురుగు పట్టినా, ఐదు శాతం కన్నా ఎక్కువ ఉండరాదని క్వింటా ధర రూ.2,300, ఏ గ్రేడ్ రకం రూ.23,320 నిర్ణయించినట్లు తెలిపారు. ప్రభుత్వం ధాన్యం పంపిన వారం రోజుల్లోగా రైతు ఖాతాలో నగదు జమ చేయబడుతుందని తెలియజేశారు. సొసైటీ కార్యదర్శి ప్రసాద్, రైతులు పాల్గొన్నారు.

'చైతన్య సభలు జయప్రదం చేయాలి'

ఏలూరు : భారత రాజ్యాంగం పేరుతో ఈనెల 19వ తేదీ నుంచి 30వ తేదీ వరకు 12 రోజులు చైతన్య సభలు నిర్వహించాలని హేలాపురి బాలోత్సవం ఎవిఆర్ విజ్ఞాన కేంద్రం భారత బచావో బహుజన్ ఆఫీసర్స్ అండ్ ఎంప్లాయిస్ ఫెడరేషన్ పిలుపునిచ్చాయి. సోమవారం సాయంత్రం ఆ సంఘాల ప్రతినిధుల సమావేశం నిర్వహించారు. ఈ సమావేశానికి బోఫ్ జాతీయ అధ్యక్షులు డాక్టర్ దేవరకొండ వెంకటేశ్వర్లు అధ్యక్షత వహించారు. ఈ సమావేశంలో ఎవిఆర్ విజ్ఞాన కేంద్రం కార్యదర్శి గుడిపాటి నరసింహారావు, భారత బచావో ఉభయగోదావరి జిల్లాల పెరియర్ పూలే అంబేద్కర్, బోఫ్ కమిటీ నాయకులు ఎస్‌కె కాసిం, హేలాపురి బాలోత్సవం కమిటీ నాయకులు వివి.రాంబాబు, ఎస్.రవి, వై.నిర్మల, కె.సోమ్లా నాయక్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా 12 రోజుల కార్యక్రమ బ్రోచర్ ఆవిష్కరించారు. రాజ్యాంగంపై నిర్వహించే సభల్లో విద్యార్థులకు పోటీలు నిర్వహించి బహుమతులు, సర్టిఫికెట్లు అందజేస్తామని తెలిపారు.

కోత యంత్రాల కిరాయిలు నియంత్రించాలి

రైతు సంఘం ఆధ్వర్యాన 'మీకోసం'లో జెసికి వినతి

కలెక్టర్‌తో మాట్లాడుతున్న రైతు సంఘం నాయకులు

ప్రజాశక్తి - ఏలూరు అర్బన్

వరి కోత మిషన్ కోత కిరాయిలు నియంత్రించాలని, అధిక కిరాయిల వసూలు ఆపాలని ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం ఆధ్వర్యంలో సోమవారం మీకోసంలో జిల్లా జాయింట్ కలెక్టర్ ధాత్రి రెడ్డికి రైతులు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు కట్టా భాస్కరరావు, కె.శ్రీనివాస్ మాట్లాడుతూ జిల్లాలో ఖరీఫ్ వరి కోతలు ముమ్మరంగా జరుగుతున్నాయని, వాతావరణ మార్పులు, పరిస్థితులు ఆసరా చేసుకుని వరి కోత మిషన్ కిరాయిలు పెంచేస్తున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. గంటకు రూ.3 వేల నుంచి రూ.3,500 వరకు వసూలు చేస్తున్నారన్నారు. చాలా చోట్ల వరి పంట నేలకొరిగి పోవడంతో మిషన్ కోత సమయం మూడు గంటల వరకూ పడుతుందని, ఎకరా వరిపంట కోయడానికి రూ.10 వేలకుపైగా రైతు పెట్టుబడి పెట్టవలసి వస్తోందన్నారు. వరికోత మిషన్ల కిరాయిలు నియంత్రణ, పర్యవేక్షణ లేకపోవడంతో రైతులు, కౌలు రైతులు ఇబ్బంది పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. వరి కోత కిరాయిలు నియంత్రణకు తగు చర్యలు చేపట్టాలని, కిరాయి నిర్ణయించి ఆ కిరాయి అమలు జరిగేలా ప్రభుత్వ పర్యవేక్షణ చేయాలని కోరారు.

అన్నా క్యాంటీన్ సిబ్బంది సమస్యలు పరిష్కరించాలి

సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు సోమయ్య

ఏలూరు అర్బన్ : అన్నా క్యాంటీన్లలో పనిచేసే సిబ్బంది సమస్యలు పరిష్కరించాలని సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు బి.సోమయ్య డిమాండ్ చేశారు. సిబ్బందికి బకాయి జీతాలు వెంటనే చెల్లించాలని కోరుతూ సోమవారం ఆయన మున్సిపల్ కమిషనర్‌కు వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా సోమయ్య మాట్లాడుతూ ఏలూరు నగరంలో 4 అన్నా క్యాంటీన్లు నిర్వహిస్తున్నారని, ఆగస్టు 15 నుంచి అన్నా క్యాంటీన్లు ప్రజానీకానికి సేవలందిస్తున్నాయని తెలిపారు. కానీ అందులో పనిచేసే సిబ్బంది సమస్యలు ఎవరూ పట్టించుకోవడంలేదని, సిబ్బంది ఉదయం 7 గంటల నుంచి రాత్రి 9 గంటల వరకు పని చేయాల్సి వస్తుందని తెలిపారు. ఇంత కష్టపడి పని చేస్తున్నప్పటికీ సిబ్బందికి సరైన జీతాలు లేవని, ఇచ్చే అరకొర జీతాలు సకాలంలో ఇవ్వటం లేదని ఆయన తెలిపారు. గతనెలలో ఇవ్వాల్సిన జీతాలు నేటికీ చెల్లించలేదని తెలిపారు. అన్నా క్యాంటీన్ల సిబ్బంది సమస్యలు వెంటనే పరిష్కరించాలని, లేనిపక్షంలో సిఐటియు తరపున ఆందోళన చేపడుతామని తెలిపారు.

వికలాంగురాలికి వీల్ చైర్ అందజేత

ఏలూరు : కలెక్టరేట్‌లోని గోదావరి సమావేశ మందిరంలో సోమవారం నూజివీడుకు చెందిన వికలాంగురాలు కె.సంజనా ప్రియకు వీల్ చైర్‌ను జిల్లా కలెక్టర్ కె.వెట్రిసెల్వి అందజేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ సంజనాప్రియను పలకరిస్తూ బాగా చదువుకోవాలని సూచించారు. వికలాంగులకు ఉన్న సమస్యలను పరిష్కరిస్తూ వారికి సహాయంగా ఉంటామన్నారు. నడవలేని స్థితిలో ఉన్నవారికి చాలా సహాయంగా ఉపయోగపడే వీల్ చైర్స్ నందించడం చాలా సంతోషకరంగా ఉందన్నారు. డిఆర్‌డిఎ పీడీ ఆర్.విజయరాజు, డిఇఒ వెంకట లక్ష్మమ్మ, డిప్యూటీ డిఎంహెచ్ఒ నాగేశ్వరరావు పాల్గొన్నారు.

ఘనంగా లూయిస్ డాగురే జయంతి

టి.నరసాపురం : కెమెరా సృష్టి కర్త లూయిస్ డాగురే జయంతి వేడుకలు సోమవారం ఫొటో, వీడియో గ్రాఫర్ల యూనియన్ ఆధ్వర్యాన ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా పాల్గొన్న స్థానిక జెడ్‌పి హైస్కూల్ హెచ్ఎం బి.లింగస్వామి చేతుల మీదుగా హైస్కూల్ వద్ద ఏర్పాటు చేసిన డాగురే విగ్రహానికి పూలమాల వేసి నివాళులు అర్పించారు. అనంతరం స్థానిక ప్రభుత్వ ఆసుపత్రిలో రోగులకు పండ్లు యూనియన్ సభ్యులు, వైద్యుల చేతుల మీదుగా పంపిణీ చేశారు. ఈ సందర్భంగా లింగస్వామి మాట్లాడుతూ ప్రపంచాన్ని కెమెరాలో బంధించే విధంగా కెమెరా అద్భుత సృష్టి అన్నారు. వైద్యులు హనుమంతరావు, యూనియన్ వైస్ ప్రెసిడెంట్ మహారాజు,పాల్గొన్నారు.

కాంగ్రెస్ సీనియర్ నాయకులు నాగేశ్వరరావు మృతి



ఆగిరిపల్లి : కాంగ్రెస్ సీనియర్ నాయకులు, కృష్ణాజిల్లా మాజీ ఉపాధ్యక్షులు, ఆగిరిపల్లి గ్రామ ప్రముఖులు అయిన అన్నే నాగేశ్వరరావు(87) సోమవారం ఉదయం ఆగిరిపల్లిలోని ఆయన స్వగృహంలో మృతి చెందారు. ఆయనకు ముగ్గురు కుమారులు కలరు. అన్నే నాగేశ్వరరావు మొదట కమ్యూనిస్టుగా రాజకీయాల్లోకి వచ్చి తర్వాత కాంగ్రెసు వాదిగా మారి, గత యాభై సంవత్సరాలుగా రాజకీయ పరంపరను కొనసాగిస్తున్నారు. పాలడుగు వెంకట్రావు ముఖ్య అనుచరుడుగా పేరొంది, మండల పరిధిలోని కృష్ణవరం గ్రామ సర్పంచిగా, పిఎసిఎస్ అధ్యక్షులుగా పలు పదవులు అలంకరించి, ప్రజల సమస్యల పరిష్కారం కోసం అహర్నిశలు పాటుపడేవారు. అన్నే నాగేశ్వరరావు భౌతికకాయాన్ని కాంగ్రెస్ నాయకురాలు సుంకర పద్మశ్రీ, బిడి రవికుమార్, కాంగ్రెస్ జిల్లా ఉపాధ్యక్షులు పి.సాగర్‌కుమార్, ఆగిరిపల్లి గ్రామ సర్పంచి సిహెచ్.లక్ష్మీ విక్టర్‌బాబు, సిపిఎం నాయకులు సత్తు కోటేశ్వరరావు, సిపిఐ నాయకులు కొమ్మన నాగేశ్వరరావు, చలసాని రామారావు సందర్శించి, నివాళులు అర్పించారు. ఆయన కుటుంబానికి ప్రగాఢ సానుభూతిని తెలిపారు.

ఓటర్ల జాబితాపై అభ్యంతరాలుంటే తెలపాలి

ఏలూరు : ఉమ్మడి తూర్పు-పశ్చిమ గోదావరి, ఉమ్మడి కృష్ణా-గుంటూరు పట్టభద్రుల ఎంఎల్‌సి ఎన్నికలకు సంబంధించి జిల్లాలో మొత్తం 82 పోలింగ్ కేంద్రాలు ప్రతిపాదించడం జరిగిందని జిల్లా రెవెన్యూ అధికారి వి.విశ్వేశ్వరరావు తెలిపారు. సోమవారం స్థానిక కలెక్టరేట్‌లో జిల్లా కలెక్టర్ వారి ఆదేశాలతో సంబంధిత పోలింగ్ కేంద్రాల ప్రతిపాదనలపై వివిధ రాజకీయ పార్టీల ప్రతినిధులతో డిఆర్ఒ విశ్వేశ్వరరావు సమావేశం నిర్వహించారు. సమావేశంలో ఎన్.నెలరాజు(బిజెపి), ఆర్.సత్యనారాయణ(ఆమ్ ఆద్మీ), యు.బాలానందం, ఎస్.అచ్యుతబాబు(టిడిపి), పి.కిషోర్(సిపిఎం), డి.రత్నబాబు, ఎస్.భరత్ రావు(బిఎస్‌పి), రాజనాల రామ్మోహన్ రావు(ఐఎన్‌సి), ఎం.వెంకటనాగరాజు(జెఎస్‌పి) పాల్గొన్నారు. ఈ సందర్భంగా డిఆర్ఒ విశ్వేశ్వరరావు మాట్లాడుతూ ఈ ఎన్నికలకు సంబంధించి ఉమ్మడి తూర్పు-పశ్చిమగోదావరి పట్టభద్రుల నియోజకవర్గానికి జిల్లాలోని ఏలూరు డివిజన్‌లో 33, నూజివీడు డివిజన్‌లో 6, జంగారెడ్డిగూడెం డివిజన్‌లో 23 పోలింగ్ కేంద్రాలు ప్రతిపాదించడం జరిగిందన్నారు. ఈ ఎన్నికలకు సంబంధించి ఈనెల 23న తుది ఓటర్ల జాబితా ప్రకటించబడుతుందన్నారు. అనంతరం ఈనెల 23 నుంచి డిసెంబర్ 9వ తేదీ వరకు క్లెయిమ్‌లు, అభ్యంతరాలు సమర్పించవచ్చున్నారు. డిసెంబర్ 30వ తేదీన తుది ఓటర్ల జాబితా ప్రకటించబడుతుందన్నారు.

గుడ్, బ్యాడ్ టచ్‌పై అవగాహన

కలిదిండి : బాలికలు గుడ్ టచ్-బ్యాడ్ టచ్‌లపై అవగాహన కలిగి ఉండాలని కైకలూరు ఐసిడిఎస్ సూపర్వైజర్ జి.కరుణ కుమారి అన్నారు. మండలంలోని కాళ్లపాలెం పంచాయతీ పరిధి ఆరుతెగలపాడు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో బాలల హక్కుల పరిరక్షణ-అందరి బాధ్యత అనే అంశంపై సమావేశం జరిగింది. బాల్య వివాహాలు, బాలల హక్కులపై విద్యార్థులకు వివరించారు. హెచ్ఎం ఎ.శ్రీనివాసరావు, ఎంఎస్‌కె వై.పావని పాల్గొన్నారు.

CHANGE OF NAME

I, **NIMMANA DEVID RAJU** S/o. Nimmana Mahankali Rao, resident of, D.No. 3-105, Pittavari Meraka, Lakshmaneswaram, Narasapuram Mandal, W.G.Dt., A.P. I have changed my name from **NIMMANA YESURAJU** (Old name) to **NIMMANA DEVID RAJU** (New name) hence after all my documents and correspondence will be countinue with my New name
NIMMANA DEVID RAJU

EC పాస్ పోర్ట్ పోయినది

పశ్చిమగోదావరి జిల్లా, ఆచంట మండలం, ఆచంట గ్రామం కాపరస్తుడైన **యాంద్ర శివప్రసాద్**, తండ్రి ధర్మారావు అను నేను నా యొక్క EC పాస్పోర్ట్ పోయినది. ఇంటి దగ్గర నుండి ఆచంట కచేరి సెంటర్ దగ్గరికి వస్తుండగా నా యొక్క EC పాస్పోర్ట్ పోయినది. EC PASSPORT NO : X0962376 గల పాస్పోర్ట్ ఎవరికైనా దొరికిన ఎడల ఈ క్రింది అడ్రస్ కు తెలియజేయగలరు

యాంద్ర శివప్రసాద్, తండ్రి : ధర్మారావు
డోర్.నెం: 28-12, క్రిందిపోరా,
ఆచంట గ్రామం, ఆచంట మండలం,
ప.గో.జిల్లా. సెల్ : 8985143236

నోటీసు

మహారాజశ్రీ సివిల్ జడ్జి (సీనియర్ డివిజన్) వారి కోర్టులో : నర్సాపురం

I.P.No.18/2023

Between:
యిళ్ళ సూర్యవతి ...పిటీషనర్
Vs
వట్టికూటి విఘ్నేశ్వరి వగైరా ...రెస్పాండెంట్
To.
R1: వట్టికూటి విఘ్నేశ్వరి, భర్త హనుమంతరావు, డోర్‌నెం.2-89, పండిత విల్లూరు, పోడూరు మండలం, పశ్చిమ గోదావరి జిల్లా. PJCJC.

పై నెంబర్ పిటీషనులో మొదటి రెస్పాండెంట్ అయిన మీకు శ్రీకోర్టు వారు అనేక పర్యాయములు నోటీసు పంపించినప్పటికి తీసుకొనకుండా తప్పించుకుని తిరుగుచున్నందున మీ హాజరు నిమిత్తము వాయిదా ది.**29-11-2024** తేదిన యున్నది. ఆరోజు ఉదయం 10-30 ని॥లకు మీరు స్వయముగా గాని వకీలు ద్వారా గాని కోర్టుకు హాజరై మీకు అభ్యంతరములు ఉన్నయెడల తెలియజేసుకొనగలరు. లేనియెడల మీ పరోక్షమున తీర్మానము చేయుదురని ఈ పత్రిక ప్రకటన ద్వార తెలియపరచడమైనది. శ్రీకోర్టు వారి ఆదేశములు మేరకు.
వాయిదా తేది: 29-11-2024
పాలకొల్లు **ఐ.శివసాంబమూర్తి**
తేది.17-11-2024 అడ్వకేట్, పాలకొల్లు.

మహారాజశ్రీ ప్రిన్సిపల్ సివిల్ జడ్జి (జూనియర్ డివిజన్)-కమ్-జ్యుడిషియల్ మెజిస్ట్రేట్ ఫస్ట్ క్లాస్ వారి కోర్టులో, నరసాపురం

O.S. No. 171/2023

స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా, వీరవాసరం బ్రాంచ్, రిప్రజెంటెడ్ బై ఇట్స్ బ్రాంచ్ మేనేజర్, వీరవాసరం -వాది
మరియు
D-1) తొంటా జ్యోతి అండ్ అనదర్ ...ప్రతివాది/ప్రతివాదులు

సమన్స్ టు:
D-1: తొంటా జ్యోతి, W/o. శ్రీనివాసరావు, డోర్ నెం. 2-72, 4వ బ్లాకు, గగ్గిపర్రు, H/o అదవిపాలెం, యలమంచిలి మండలం, ప॥గో॥జిల్లా.
D-2: వేముల స్వాతి, D/o. రాజేశ్వరరావు, డోర్ నెం. 4-85, 4వ బ్లాకు, గగ్గిపర్రు, H/o అదవిపాలెం, యలమంచిలి మండలం, ప॥గో॥జిల్లా.

మీరు వాది స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా, వీరవాసరం బ్రాంచ్ వారికి చెల్లించవలసిన బాకీ చెల్లించనందున మహారాజశ్రీ నరసాపురం ప్రిన్సిపల్ సివిల్ జడ్జి (జూనియర్ డివిజన్) -కమ్-జుడిషియల్ మెజిస్ట్రేట్ ఆఫ్ ఫస్ట్ క్లాస్ వారి కోర్టులో పై నెంబరు దావా దాఖలు చేసియున్నారు. సదరు దావాలో శ్రీ కోర్టు వారి ద్వారాను, రిజిస్టరు పోస్టు ద్వారాను దావా సమన్లు పంపించినను అవి అమలు కానందున ఈ ప్రకటన ద్వారా మీకు తెలియజేయునది ఏమనగా **ది. 21-11-2024 సం॥రం తేదీన ఉదయం గం॥ 10.30 ని॥లకు** మీరు స్వయంగా గాని, ప్లీడరు గారి ద్వారా గాని కోర్టుకు హాజరై మీ ఆక్షేపణలు తెలియజేసుకొనవలెను. లేని యెడల మీ పరోక్షమున సదరు దావా విచారించబడి తీర్మానించబడునని మీకు తెలియచేయడమైనది.
మోచర్ల సత్యకృష్ణ, న్యాయవాది
3-4-10, జంపావారి వీధి
నరసాపురం నరసాపురం-534275, ప॥గో॥జిల్లా
ది. 18-11-2024 సెల్: 98662 59514

సర్టిఫికెట్ పోయినది

విషయం : నా కుమారుడు SSC సర్టిఫికెట్ నందు నా ఇంటి పేరులో గల అక్షర దోషమును సరిచేసుకుంటున్న విషయమును పత్రికాముఖంగా తెలియపరచుట గురించి. మా కుమారుడు అయిన తన్నీడి అనీల్ కుమార్ ఢిల్లీ పబ్లిక్ స్కూల్, భీమవరంలో SSC చదవడం జరిగింది. మా కుమారుడి యొక్క SSC సర్టిఫికెట్‌లో నా యొక్క పేరు **TANNIDI KANAKARAJU** గా ముద్రించబడినది. కానీ నా యొక్క అసలు పేరు **TANNEDI KANAKARAJU** నా ఇంటి పేరులో గల దోషమును సరిచేసుకుంటున్నాను. ఈ విషయాన్ని పత్రికాముఖంగా ప్రజలందరికీ తెలియజేసు కుంటున్నాను.
ఇట్లు
తన్నీడి కనకరాజు
కోమటి తిప్ప పంచాయితీ
నీటితిప్ప గ్రామం, మొగల్తూరు మండలం, ప.గో.జిల్లా

పాస్‌పోర్టు పోయినది

PONNAMANDA DURGA అను నాకు విశాఖపట్నం పాస్‌పోర్టు కార్యాలయం అధికారులు ది.25-09-2017న R4553180 నెంబరు గల పాస్‌పోర్టు మంజూరు చేసారు. సదరు పాస్ పోర్టు జిరాక్స్ కాపీలు తీయించుకునేందుకు ది.10-11-2024న దారి తప్పి గ్రామం నుండి నరసాపురం వస్తుండగా నా ఒరిజినల్ పాస్‌పోర్టు పోయినది. గాన నా పాస్‌పోర్టు ఎవరికైనా దొరికిన యెడల ఈ క్రింది చిరునామాకు అందించగలరని కోరుతున్నాను.

PONNAMANDA DURGA
W/o. Ponnamanda Yesu
D.No. D.No. 4-91, Daritippa
Mogalturu Mandal, W.G.Dt., A.P.

మహారాజశ్రీ ప్రిన్సిపల్ సివిల్ జడ్జి (జూనియర్ డివిజన్)-కమ్-జ్యుడిషియల్ మెజిస్ట్రేట్ ఫస్ట్ క్లాస్ వారి కోర్టులో, నరసాపురం

O.S. No. 297/2023

స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా, వీరవాసరం బ్రాంచ్, రిప్రజెంటెడ్ బై ఇట్స్ బ్రాంచ్ మేనేజర్, వీరవాసరం -వాది
మరియు
D-1) కొండేటి శ్రీరామచంద్రమూర్తి అండ్ అనదర్ ...ప్రతివాది/ప్రతివాదులు

సమన్స్ టు:
D-1: కొండేటి శ్రీరామచంద్రమూర్తి, S/o. వెంకటరమణారావు, డోర్ నెం. 2-103, 4వ బ్లాకు, గగ్గిపర్రు, H/o అదవిపాలెం, యలమంచిలి మండలం, ప॥గో॥జిల్లా.
D-2: వేముల వెంకటలక్ష్మి, W/o. వర్ధనరావు, డోర్ నెం. 4-129, 4వ బ్లాకు, గగ్గిపర్రు, H/o అదవిపాలెం, యలమంచిలి మండలం, ప॥గో॥జిల్లా.

మీరు వాది స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా, వీరవాసరం బ్రాంచ్ వారికి చెల్లించవలసిన బాకీ చెల్లించనందున మహారాజశ్రీ నరసాపురం ప్రిన్సిపల్ సివిల్ జడ్జి (జూనియర్ డివిజన్) -కమ్-జుడిషియల్ మెజిస్ట్రేట్ ఆఫ్ ఫస్ట్ క్లాస్ వారి కోర్టులో పై నెంబరు దావా దాఖలు చేసియున్నారు. సదరు దావాలో శ్రీ కోర్టు వారి ద్వారాను, రిజిస్టరు పోస్టు ద్వారాను దావా సమన్లు పంపించినను అవి అమలు కానందున ఈ ప్రకటన ద్వారా మీకు తెలియజేయునది ఏమనగా **ది. 21-11-2024 సం॥రం తేదీన ఉదయం గం॥ 10.30 ని॥లకు** మీరు స్వయంగా గాని, ప్లీడరు గారి ద్వారా గాని కోర్టుకు హాజరై మీ ఆక్షేపణలు తెలియజేసుకొనవలెను. లేని యెడల మీ పరోక్షమున సదరు దావా విచారించబడి తీర్మానించబడునని మీకు తెలియచేయడమైనది.
మోచర్ల సత్యకృష్ణ, న్యాయవాది
3-4-10, జంపావారి వీధి
నరసాపురం నరసాపురం-534275, ప॥గో॥జిల్లా
ది. 18-11-2024 సెల్: 98662 59514

మహారాజశ్రీ ప్రిన్సిపల్ సివిల్ జడ్జి (జూనియర్ డివిజన్)-కమ్-జ్యుడిషియల్ మెజిస్ట్రేట్ ఫస్ట్ క్లాస్ వారి కోర్టులో, నరసాపురం

O.S. No. 299/2023

స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా, వీరవాసరం బ్రాంచ్, రిప్రజెంటెడ్ బై ఇట్స్ బ్రాంచ్ మేనేజర్, వీరవాసరం -వాది
మరియు
D-1) బోనం విజయలక్ష్మి అండ్ అనదర్ ...ప్రతివాది/ప్రతివాదులు

సమన్స్ టు:
D-1: బోనం విజయలక్ష్మి, W/o. శేషారావు, డోర్ నెం. 2-85, 4వ బ్లాకు, గగ్గిపర్రు, H/o అదవిపాలెం, యలమంచిలి మండలం, ప॥గో॥జిల్లా.
D-2: కట్టా మురళి, S/o. వెంకటేశ్వరరావు, డోర్ నెం. 4-139, 4వ బ్లాకు, గగ్గిపర్రు, H/o అదవిపాలెం, యలమంచిలి మండలం, ప॥గో॥జిల్లా.

మీరు వాది స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా, వీరవాసరం బ్రాంచ్ వారికి చెల్లించవలసిన బాకీ చెల్లించనందున మహారాజశ్రీ నరసాపురం ప్రిన్సిపల్ సివిల్ జడ్జి (జూనియర్ డివిజన్) -కమ్-జుడిషియల్ మెజిస్ట్రేట్ ఆఫ్ ఫస్ట్ క్లాస్ వారి కోర్టులో పై నెంబరు దావా దాఖలు చేసియున్నారు. సదరు దావాలో శ్రీ కోర్టు వారి ద్వారాను, రిజిస్టరు పోస్టు ద్వారాను దావా సమన్లు పంపించినను అవి అమలు కానందున ఈ ప్రకటన ద్వారా మీకు తెలియజేయునది ఏమనగా **ది. 21-11-2024 సం॥రం తేదీన ఉదయం గం॥ 10.30 ని॥లకు** మీరు స్వయంగా గాని, ప్లీడరు గారి ద్వారా గాని కోర్టుకు హాజరై మీ ఆక్షేపణలు తెలియజేసుకొనవలెను. లేని యెడల మీ పరోక్షమున సదరు దావా విచారించబడి తీర్మానించబడునని మీకు తెలియచేయడమైనది.
మోచర్ల సత్యకృష్ణ, న్యాయవాది
3-4-10, జంపావారి వీధి
నరసాపురం నరసాపురం-534275, ప॥గో॥జిల్లా
ది. 18-11-2024 సెల్: 98662 59514

మహారాజశ్రీ ప్రిన్సిపల్ సివిల్ జడ్జి (జూనియర్ డివిజన్)-కమ్-జ్యుడిషియల్ మెజిస్ట్రేట్ ఫస్ట్ క్లాస్ వారి కోర్టులో, నరసాపురం

O.S. No. 403/2022

స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా, వీరవాసరం బ్రాంచ్, రిప్రజెంటెడ్ బై ఇట్స్ బ్రాంచ్ మేనేజర్, వీరవాసరం -వాది
మరియు
D-1) వెలగన వెంకటలక్ష్మి అండ్ అనదర్ ...ప్రతివాది/ప్రతివాదులు

సమన్స్ టు:
D-1: వెలగన వెంకటలక్ష్మి, W/o. లక్ష్మణకుమార్, డోర్ నెం. 7-19, 4వ బ్లాకు, గగ్గిపర్రు, H/o అదవిపాలెం, యలమంచిలి మండలం, ప॥గో॥జిల్లా.
D-2: వేముల వర్ధనరావు, S/o. చిరంజీవి, డోర్ నెం. 4-105, 4వ బ్లాకు, గగ్గిపర్రు, H/o అదవిపాలెం, యలమంచిలి మండలం, ప॥గో॥జిల్లా.

మీరు వాది స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా, వీరవాసరం బ్రాంచ్ వారికి చెల్లించవలసిన బాకీ చెల్లించనందున మహారాజశ్రీ నరసాపురం ప్రిన్సిపల్ సివిల్ జడ్జి (జూనియర్ డివిజన్) -కమ్-జుడిషియల్ మెజిస్ట్రేట్ ఆఫ్ ఫస్ట్ క్లాస్ వారి కోర్టులో పై నెంబరు దావా దాఖలు చేసియున్నారు. సదరు దావాలో శ్రీ కోర్టు వారి ద్వారాను, రిజిస్టరు పోస్టు ద్వారాను దావా సమన్లు పంపించినను అవి అమలు కానందున ఈ ప్రకటన ద్వారా మీకు తెలియజేయునది ఏమనగా **ది. 21-11-2024 సం॥రం తేదీన ఉదయం గం॥ 10.30 ని॥లకు** మీరు స్వయంగా గాని, ప్లీడరు గారి ద్వారా గాని కోర్టుకు హాజరై మీ ఆక్షేపణలు తెలియజేసుకొనవలెను. లేని యెడల మీ పరోక్షమున సదరు దావా విచారించబడి తీర్మానించబడునని మీకు తెలియచేయడమైనది.
మోచర్ల సత్యకృష్ణ, న్యాయవాది
3-4-10, జంపావారి వీధి
నరసాపురం నరసాపురం-534275, ప॥గో॥జిల్లా
ది. 18-11-2024 సెల్: 98662 59514